క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



ములుగు రూరల్: మండలంలోని జీవంతరావుపల్లికి చెందిన ఓ చానల్ రిపోర్టర్ శరత్ తండ్రి ముకులోత్ సమ్మయ్య ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని భూపాలపల్లి సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ పరామర్శించారు. మృతుడు సమ్మయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె వెంట సర్వర్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు ఉన్నారు.

ఎస్‌జీఎఫ్ఐ మండల కమిటీ



వెంకటాపురం(కె): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) మండల కమిటీని బుధవారం మండల కేంద్రంలో ఎంఈఓ వెంకటేశ్వరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా ఎంఈఓ వెంకటేశ్వరావు, కార్యదర్శిగా పి.విజయలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సింధు, సత్యవతి, సత్యనారాయణ, రమణరావు ఉన్నారు.

కొనసాగుతున్న 'గృహలక్ష్మి' సర్వే



ఏటూరునాగారం: మండలంలోని కోయగూడ ఎల్లాపురం పరిధిలోని వార్డుల్లో గృహలక్ష్మి పథకం సర్వే కొనసాగుతోంది. బుధవారం గ్రామంలోని పలు నిరుపేదల ఇళ్లను పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ సందర్శించి వివరాలను సేకరించారు. వారికి ఎలాంటి గృహం, స్థలం, ఇతర ఆధారాలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం సొంత స్థలం ఉన్న అర్హులైన వారికి మూడు దఫాలుగా రూ.3 లక్షలను ఇవ్వనుంది. వాటితో పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం దరఖాస్తులను సేకరించి సర్వేలు చేపట్టింది. కార్యక్రమంలో కారోబార్ రాజు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

చిట్యాల: మండలంలోని దూద్‌పల్లి శివారులో నిషేధిత గుడుంబాను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై జంగిలి రమేష్ తెలిపారు. దూద్‌పల్లికి చెందిన ఎండీ.జావీద్ గుడుంబా ప్యాకెట్లను ఒక సంచిలో వేసుకుని అనుమానాస్పదంగా సంచరిస్తున్న క్రమంలో పోలీసులు తనిఖీ చేయగా అతని వద్ద 13 లీటర్ల గుడుంబా లభించినట్లు తెలిపారు. అతను లక్ష్మీపూర్ తండా బానోత్ గణపతి వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న గుడుంబాను స్వాధీనం చేసుకుని, జావీద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

వివాహిత అదృశ్యం

మహదేవపూర్ : మండల కేంద్రంలోని దుబ్బగూడేనికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు బుధవారం ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. దుబ్బగూడేనికి చెందిన వివాహిత నేరేడుకొమ్మ శ్రావణి మంగళవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. భర్త గోపాల్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



మొగుళ్లపల్లి: మండలంలోని ముల్కలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎంపీటీసీ చదువు రాంచంద్రారెడ్డి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యార్థులకు ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం అమలులో విద్యార్థులందరూ తినడానికి ఒకే రకమైన ప్లేట్స్ ఉండాలని పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చదువు అన్నారెడ్డి, ఉపసర్పంచ్ వేముల శివరాజ్, సాదు శ్రీమంజరి, పసునూటి రాము, బండారి సుమలత, స్వర్ణలత వార్డుసభ్యులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన ఉండాలి

- బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్



మంగపేట : వైద్యశిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి నిఖిల్‌కుమార్

మంగపేట: ప్రజలు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్ అన్నారు. బ్రాహ్మణపల్లి సబ్‌సెంటర్‌లో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశిబిరానికి వచ్చిన ప్రజలకు వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎలా ప్రబలుతాయనే విషయంపై వివరించారు. వ్యాధులపై అవగాహన పెంపొందించుకుని సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రజలు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రధానంగా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమకాటు వలన మలేరియా, డెంగీ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, దోమతెరలు తప్పక వినియోగించాలన్నారు. కాచి వడపోసి చల్లార్చిన నీటిని తాగాలని, నిల్వ ఉంచిన ఆహారం తీసుకోవద్దని వేడి వేడి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో 47 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. బుధవారం మండలంలోని వీరభద్రవరం, రాచపల్లి, చొక్కాల గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కుష్టువ్యాధి కేసులు గుర్తింపు కోసం ఇంటింటి సర్వే నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యాధికారి భవ్యశ్రీ

రైతు కుటుంబానికి బీమా చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్

ములుగు రూరల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు బీమా పథకం రైతు కుటుంబాలకు భరోసా కల్పిస్తుందని రాష్ట్ర గిరిజన, స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్, మహబూబాబాద్ ఎంపీ మలోత్ కవిత అన్నారు. బుధవారం బాధిత కుటుంబానికి రూ. 5లక్షల చెక్కును అందించారు. ఇటీవల వరదల కారణంగా కొండాయి గ్రామంలో రైతు ఎండీ. రఫీక్ వరదల్లో కొట్టుకుపోయి మృతి చెందగా వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గౌస్ హైదర్ పర్యవేక్షించి బాధిత కుటుంబానికి సకాలంలో చెక్కు అందించడంతో మంత్రి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిలు ప్రశంసించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, కోఆప్షన్ సభ్యురాలు వలీయాబీ, తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల్లో ఇళ్లు నిర్మించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలోని ఊరట్టం ముంపు గ్రామంలో ఇళ్లు కోల్పోయిన వారికి నిర్మించి ఇవ్వాలని తహసీల్దార్ రవీందర్‌కు గ్రామస్తులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఇటీవల కురిసిన వరదలకు గ్రామం పూర్తిగా నీట మునిగిపోయిందని, నష్టపోయిన కుటుంబాలకు ట్రైబల్ రిలీఫ్ ఫండ్ మంజూరు చేయాలన్నారు. ఇటీవల కలెక్టర్, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కావాల్సిన భూమి సేకరించి గ్రామస్తులకు అప్పగించాలని కోరారు. వరదలతో సర్వం కోల్పోయామని గృహలక్ష్మి పథకం కింద అర్హులైన కుటుంబాన్ని ఎంపిక చేయాలని తహసీల్దార్‌ను కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామస్తులు చెర్ప రవీందర్, చంద్రశేఖర్, నేతాజీ, కోటి నర్సింహులు ఉన్నారు.

బాలకార్మిక వ్యవస్థను రూపుమాపాలి



అవగాహన సదస్సులో పాల్గొన్న పోలీసులు, విద్యార్థులు

టేకుమట్ల(రేగొండ): బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా రూపు మాపేందుకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) జిల్లా ఇన్‌చార్జీ, సీఐ పులి వెంకట్ అన్నారు. బుధవారం రేగొండ మండలంలోని రంగయ్యపల్లి ఉన్నత పాఠశాలలో ఏహెచ్‌టీయూ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు బాలికలపై అఘాయిత్యాలు జరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నతనంలోనే కష్టమైన పనులు చేస్తూ మానసికంగా, శారీరకంగా తీవ్ర ఒత్తిడికి లోనవుతూ మానసిక ఎదుగుదల లేకుండా ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నిర్మల, ఉపాధ్యాయులు సతీష్, దేవేందర్‌రెడ్డి, ఏహెచ్‌టీయూ కానిస్టేబుళ్లు శ్రీనాథ్, ప్రవీన్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులపై అధికారుల విచారణ

కాటారం : ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం కోసం వచ్చిన దరఖాస్తులపై అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. మండలంలోని పలు గ్రామపంచాయితీల నుంచి వచ్చిన దరఖాస్తులపై బుధవారం అధికారులు ఇంటింటా తిరిగి విచారణ చేపట్టారు. ఎంపీడీఓ శంకర్‌నాయక్, గ్రామపంచాయతీలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో కలిసి బృందాలుగా ఏర్పడి విచారణ కొనసాగించారు. దరఖాస్తుదారుల వివరాలు, ఖాళీ స్థలం, ఇతర ధృవీకరణపత్రాలు, లబ్ధిదారుడి స్థితిగతులపై వివరాలు సేకరించి నమోదు చేసుకున్నారు. వచ్చిన ప్రతి దరఖాస్తుపై క్షేత్ర స్థాయి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు అధికారులు తెలిపారు.

కమలాపురంలో బిల్ట్ కార్మికుల నిరసన



బిల్ట్ ప్రధానగేటు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మంగపేట : మండలంలోని కమలాపురంలో గత పదేళ్లుగా మూతపడి ఉంటున్న బిల్ట్ ఫ్యాక్టరీ మెయిన్‌గేటు ఎదుట బిల్ట్ కార్మికులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ అర్ధంతరంగా ఫ్యాక్టరీని మూసివేయడంతో నమ్ముకున్న వేలాది మంది కార్మికులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. 2014 సంవత్సరంలో 52 నెలల వేతనాలు, 46 నెలల పీఎఫ్ బకాయిలు, రిటైర్‌మెంటు పర్మనెంట్ కార్మికులతో పాటు సర్వీసులో ఉన్న వారికి గ్రాడ్యుటీతో కలిపి రూ.122 కోట్లు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ. 6.49 కోట్లు చెల్లించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమకు న్యాయపరంగా చెల్లించాల్సిన వేతన బకాయిలతో పాటు అన్ని అలవెన్సులు చెల్లించే వరకు ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రిజర్వేషన్ సాధించే వరకూ ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

వెంకటాపురం(కె): మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ సాధించే వరకు ఉద్యమం కొనసాగించాలని మాదిగ జేఏసీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాసం రమేష్ అన్నారు. బుధవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో మాదిగ జేఏసీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రిజర్వేషన్ విధానంతో మాదిగలు తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీలకు ఉమ్మడి రిజర్వేషన్ వర్గీకరించే హక్కులను రాష్ట్రాలకు కల్పిస్తూ పార్లమెంట్‌లో చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20న వెంకటాపురంలో జరిగే మాదిగ జేఏసీ జిల్లాస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు తోకల అంజి, తోకల శివ, నరేష్ పాల్గొన్నారు.

సంస్మరణ సభను విజయవంతం చేయాలి

మల్హర్: ప్రజాయుద్ద నౌక గద్దర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని గద్దర్ సంస్మరణ సభ నిర్వహణ కమిటీ ప్రధాన సలహాదారుడు దండు రమేష్ బుధవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భారత్ ఫంక్షన్‌లో శుక్రవారం నిర్వహించే సభకు విప్లవకారుడు, ప్రజాస్వామికవాదులు, గద్దర్ అభిమానులు, విద్యావంతులు, కవులు, కళాకారులు, మేధావులు, విద్యార్థులు, ఉద్యోగులు, ఉద్యమకారులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ములుగు రూరల్ : ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గోవిందరావుపేట మండలం ముత్తాపూర్ గ్రామంలో వరద బాధితులకు దాతల సహకారంతో కాంగ్రెస్ నాయకులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ మేరకు బుధవారం భద్రాచలం జిల్లా సారపాక గ్రామస్తుల సహకారంతో 130 కుటుంబాలకు సాయం అందించారు. ఈ సందర్భంగా కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ మాట్లాడుతూ వరద బాధితులకు సహాయం అందించేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటక్రిష్ణ, శ్యామ్‌రావు, దేవేంద్రాచారి, శ్రీనివాస్, సీతారాం నాయక్, ప్రభాకర్, క్రాంతి, శ్రీకాంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత



బాధితులకు కిట్ అందజేస్తున్న దాతలు

కేయూ క్యాంపస్: వరద బాధితులకు కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ (కుర్తా)లో సభ్యులుగా ఉన్న రిటైర్డ్ ప్రొఫెసర్లు చేయూతనందించారు. సుమారు రూ.2.20 లక్షలతో మృతుల కుటుంబాలకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం, అలాగే సుమారు 100 కుటుంబాలకు దుప్పట్లతోపాటు దుస్తులు అందజేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మోరంచ సమీపంలోని చెంచుకాలనీ, ములుగు జిల్లాలోని బూర్గుపేట, వెంకటపూర్ మండలంలోని నల్లగుంట, పస్రా సమీపంలోని ప్రాజెక్టు నగర్, ఏటూరునాగారం సమీపంలోని కొండాయిలోని వరద బాధితులను కుర్తా బాధ్యులు కలిసి సాయం చేసినట్లు కేయూ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ సదానందం, జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్ యూనివర్సిటీలో బుధవారం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కుర్తా ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, కార్యవర్గ సభ్యుడు ప్రొఫెసర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



సాయికుమార్ (ఫైల్)

ఏటూరునాగారం : మండలంలోని రొయ్యూర్ గ్రామానికి చెందిన గడ్డం సాయికుమార్ (22) బుధవారం మధ్యాహ్నం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. రొయ్యూర్‌కు చెందిన గడ్డం లక్ష్మీనారాయణ–సరిత దంపతులకు ఇద్దరు కుమారులు. సాయి రొయ్యూర్ చెక్‌పోస్టు వద్ద కిరాణం షాపును నడిపిస్తూ అందరితో కలివిడిగా ఉండేవాడు. అయితే బుధవారం గ్రామంలోని ఓ పురుగుల మందు దుకాణంలో ఇంట్లో ఎలుకలు బాగా తిరుగుతున్నాయి...మా నాన్న పురుగుల మందు తెమ్మన్నాడని చెప్పి కొనుగోలు చేసుకొని ముల్లెకట్ట గ్రామానికి వెళ్లే రోడ్డు వైపువెళ్లాడు. ఇంటికి వెళ్తానని చెప్పి సాయి ఎందుకు ఇటు వెళ్తున్నాడని అనుమానం వచ్చిన దుకాణ నిర్వాహకుడు అతని మిత్రులకు సమాచారం ఇచ్చాడు. దీంతో వారు కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి చెప్పగా వెంటనే కుటుంబ సభ్యులు సాయి వెళ్లిన స్థలానికి వెళ్లగా అప్పటికే పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. వెంటనే ఏటూరునాగారం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడి వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాల్సిందిగా రెఫర్ చేయడంతో సామాజిక ఆస్పత్రికి తరలించగా వైద్యులు వరంగల్ వెళ్లమన్నారు. ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు.

మద్యం మత్తులో..



నానాజీ మృతదేహం

వెంకటాపురం(కె): మద్యం మత్తులో పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..మండల పరిధిలోని తిప్పాపురం గ్రామానికి చెందిన మీడియం నానాజీ(32) గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడని తెలిపారు. మద్యం మత్తులో గుర్తుతెలియని పురుగుల మందు తాగినట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులుఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

వర్గీకరణకు కాంగ్రెస్ కృషి చేయలేదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

భూపాలపల్లి రూరల్ : ఎస్సీ వర్గీకరణ కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేయలేదని, ఇప్పుడు కూడా ఆ పార్టీ ఎస్సీ వర్గీకరణ కోసం పాటుపడి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ కందికట్ల విజయ్ మాదిగ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ కార్యకర్తలతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మందకృష్ణ మాదిగపై చేసిన ఘాటు విమర్శలు సరికావన్నారు. రేవంత్ రెడ్డి జెడ్పీటీసీ నుంచి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ స్థాయికి ఎదిగింది మాదిగల వల్లే అనే విషయాన్ని రేవంత్‌రెడ్డి మర్చిపోకూడదన్నారు. ఇప్పుడు మాదిగలను అవమానించే పద్ధతిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణపైన చర్చలో ఎప్పుడు రేవంత్ రెడ్డి మాట్లాడలేదన్నారు. కర్ణాటకలో మాదిగలకు పెద్దపీట వేసిన బీజేపీకి అండగా నిలిచామని పార్లమెంటులో కూడా బిల్లు ఆమోదిస్తే బీజేపీని ఆదరిస్తామని తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బట్టు విజయకుమార్, ఎంఎస్‌పీ నాయకులు గట్ల రాజన్న, నోముల శ్రీనివాస్, బిక్షపతి, సురేష్, రాజేందర్, ప్రవీణ్, రాజేందర్, భరత్, తిరుపతి, పవన్, శ్రీకాంత్, రాజ్‌కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

మంథని యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా విలాస్‌రావు



విలాస్‌రావు

మహదేవపూర్ : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున రాష్ట్ర వ్యాప్తంగా యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లను బుధవారం జాతీయ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు బీ.వీ.శ్రీనివాస్ రాష్ట్ర యూత్ అధ్యక్షుడు శివసేనరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని అంబట్‌పల్లి గ్రామ సర్పంచ్ విలాస్‌రావుకు మంథని నియోజకవర్గ కాంగ్రెస్ యూత్ ఇన్‌చార్జిగా నియమించారు. తన నియామకానికి సహకరించిన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి

- కాంగ్రెస్ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు



గ్రామస్తులతో మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయరావు

టేకుమట్ల : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం మండలంలోని వెంకట్రావుపల్లిలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతీ వాడలో తిరుగుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలు, వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను తెలుసుకుని రైతులతో ముఖాముఖి మాట్లాడారు. గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నాయకులు అధికారం కోసం హామీలను ఇచ్చి ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. విపత్తులో ప్రతీయేటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నా పంట నష్టాన్ని అందించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగినా రైతులకు హామీ ఇవ్వకపోవడం సిగ్గు చేటన్నారు. అనంతరం గ్రామంలో పల్లెనిద్ర చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, యూత్ జిల్లా అధ్యక్షులు బండ శ్రీకాంత్, నాయకులు నాంపెల్లి వీరేశం, దాసారపు సదానందం, తోడేటి కుమార్, కృష్ణారెడ్డి, ఆడెపు సంపత్, శాస్త్రాల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ వేణుచందర్

మొగుళ్లపల్లి: సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంతో గ్రామాల్లో నేరాలను నియంత్రించవచ్చని చిట్యాల సీఐ వేణుచందర్ అన్నారు. బుధవారం మండలంలోని పిడిసిల్ల గ్రామ ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా నేరాల సంఖ్య తగ్గుతుందన్నారు. నిందితులు నిఘా నేత్రం నుంచి తప్పించుకోలేరని ఒక్కో సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీధర్, సర్పంచ్ నైనకంటి ప్రభాకర్ రెడ్డి, ఎంపీటీసీ దండ వెంకటేశ్వర్‌రెడ్డి, ఉప సర్పంచ్, మాదం రాజయ్య, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బుర్ర రమేష్‌కు సన్మానం



రమేష్‌ను సన్మానిస్తున్న గౌడ కులస్తులు

మొగుళ్లపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఉమ్మడి గౌడ సంఘాల జేఏసీ చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్‌గౌడ్‌ను బుధవారం మండల కేంద్రానికి చెందిన గౌడ కులస్తులు సన్మానించారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ బహుజన రాజ్యాధికారానికై బాటలు వేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని ఆగస్టు 18న కులస్తులు పెద్ద ఎత్తున ఉత్సవాలను నిర్వహించుకోవాలని కోరారు. అనంతరం ఉమ్మడి గౌడ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ చిత్రపటాన్ని ఆయన మొగుళ్లపల్లి గౌడ సంఘం సొసైటీకి అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు వేముల మహేందర్‌గౌడ్, బత్తిని రమేష్ గౌడ్, బత్తిని శంకరయ్య గౌడ్, బత్తినిస్వామి గౌడ్, బత్తిని కృష్ణగౌడ్, సంపత్ గౌడ్, సతీష్ గౌడ్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు : 9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 8074606274